(ప్రభుత్వ సంస్థ)



సుతీర్థ భట్టాచార్య, ఐ.ఎ.ఎస్.
చైర్మన్ అండ్ ఎం.డి.

ప్రియమైన సింగరేణీయులారా!

రానున్న దసరా, బక్రీద్, దీపావళి పండుగలసందర్భంగా మీకూ, మీ కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పర్వదినాలసందర్భంగా ఈ లేఖ ద్వారా కొన్ని విషయాలను మీతో పంచుకోవాలనుకొంటున్నాను.

పండుగలు మనలో కొత్త ఉత్సాహాన్ని ఉత్తేజాన్ని నింపుతాయి. దసరా, దీపావళి పండుగలు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకలుగా మనం ఆనందోత్సాహాలతో జరుపుకొంటున్నాం. అలాగే బక్రీద్ పండుగ దేవునిపై గలభక్తికి, త్యాగానికి నిదర్శనంగా జరుపుకుంటాం. ఈ పండుగల స్ఫూర్తిని మనం మన నిత్యజీవితంలోనూ, పనిలోనూ ఆపాదించు కొని ముందుకు సాగాలి. మంచి ఉద్దేశాలను గౌరవించాలి. చెడు అలవాట్లను విడనాడాలి. రక్షణ సూత్రాలు పాటించాలి. ఇచ్చిన లక్ష్యాలు సాధించాలి. మనం మంచి వ్యక్తులుగానే కాదు మంచి ఉద్యోగులుగా కూడా ఎదగాలి, పేరు తెచ్చుకోవాలి. వ్యక్తిగతంగా ప్రతీ ఒక్కరూ తమకు ఇచ్చిన పనులు తాము చేయగల్గితే, సమిష్టిగా మనం మన లక్ష్యాలు సాధించినట్లే అని భావించాలి.

ఈ ఏడాది మనం ఉత్పత్తిలో వెనుకబడి ఉన్న విషయం మీకు తెలుసు. ఈ సెప్టెంబర్‌నెలవరకూ సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యం 247.02 లక్షలటన్నులు కాగా, సాధించింది మాత్రం 206.24 లక్షలటన్నులు అనగా 83% మాత్రమే. ఉద్యోగులుగా పూర్తి లక్ష్యసాధన దిశగా మనం పనిచేయాలి. ముఖ్యంగా ఒ.ఎం.ఎస్. (ఉత్పాదకత) బాగా పడి పోయి 3.12 మాత్రమే ఉంది. దీన్ని వార్షిక ఒ.ఎం.ఎస్. లక్ష్యం 4.39కు పెంచాల్సి ఉంది. గైర్హాజరు శాతం (22%)కూడా తగ్గడం లేదు. దీన్ని తగ్గించడానికి అధికారులతోపాటు ఉద్యోగులుగా మీరూ సహకరించాలి. గైర్హాజరు తగ్గించగలిగితే ఉద్యోగులకు వేతనాలు, ఇన్సెటివ్స్ వంటివి పెరగటంతోపాటు కంపెనీ ఉత్పత్తి పెరిగే వీలుంది. దీనిలో కార్మికులకుటుంబ సభ్యులు కూడా తమవంతు సహకారం అందించాలని కోరుతున్నాను.

సింగరేణీయులారా!

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. అభివృద్ధిపథంలో ఉన్న మన దేశానికి నేడు విద్యుత్ అవసరం ఎంతో ఉంది. తగినంత విద్యుత్తు లభించక పోతే దేశాభివృద్ధి కుంటుపడుతుంది. ఇటీవల ఫిక్కి-బూజ్ అండ్ కంపెనీ వారు విద్యుత్ సరఫరాపై విడుదలచేసిన ఒక నివేదికలో మన దేశంలో తగినంత విద్యుత్ ఉత్పత్తి జరగనందువల్ల పరోక్షంగా దాదాపు 4.15 లక్షలకోట్ల రూపాయలస్థూలజాతీయోత్పత్తి కోల్పోయినట్టు పేర్కొనడం జరిగింది. అలాగే, గత ఏడాది 70వేలకోట్ల రూపాయలవిలువైన విదేశీ బొగ్గును దిగుమతి చేసుకొన్నాం. దీనివలన మన దేశం ఎంతటి విదేశీ మారక ద్రవ్యాన్ని కోల్పోయిందో ఊహించండి! రూపాయి విలువ పతనం అవడంలో ఇటువంటివే చాలా ప్రభావం చూపుతున్నాయని ఆర్థిక నిపుణులు తెలియజేస్తున్నారు. ఇవి ఎంతో ఆలోచించాల్సినవిషయాలు. తగినంత విద్యుత్ ఉత్పత్తి సాధించాలంటే దేశంలో బొగ్గు ఉత్పత్తి పెరగాలి. కనుక మనం మనకు నిర్ధేశించిన లక్ష్యాలు సాధించాలి. అలా చేయడం ద్వారా మనం కేవలం డ్యూటీ చేసినట్లు మాత్రమే కాదు, దేశానికి, దేశ అవసరాలకు తోడ్పడినట్లు అని ప్రతి సింగరేణీయుడు భావించాలి. కనుక రానున్న ఆరు నెలలకాలంలో నిర్దేశించిన మన ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తారని ఆశిస్తున్నాను.

ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి ఆర్‌కె ఓసిలో ఓబి తీసే పనులుమొదలై, మార్చి నుండి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించటానికి మరియు ప్రతిష్ఠాత్మక ఆడ్రియాల లాంగ్‌వాల్ నుండి కూడా నూతన సంవత్సరంనుండి ఉత్పత్తి ప్రారంభించడానికి ప్రణాళికలను రూపొందించటం జరిగింది.

ఉత్పత్తి తొందరలో ఎవరూ పొరపాట్లు చేయవద్దు. రక్షణను మరువ వద్దు. రక్షణతో పాటు మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోండి. మీ ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఏరియాల్లోని మన ఆసుపత్రుల్లో హైదరాబాద్ నుంచి స్పెషలిస్టు డాక్టర్ల బృందాలను ప్రతీ నెలా రప్పిస్తూ సేవలు అందిస్తున్నాం. ఏరియా ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చడం జరిగింది. ప్రతీ కార్మికుని ఆరోగ్యాన్ని పర్యవేక్షించే ఏర్పాటు కూడా చేయబోతున్నాం. బి.పి., షుగర్, మూత్రపిండాలవ్యాధులబారిన పడే వారి సంఖ్య రోజురోజుకూ పెరగడం ఆందోళన కల్గిస్తోంది. కనుక సకాలంలో వైద్యం పొంది, విలువైన జీవితాన్ని నిండు నూరేళ్ళు అనుభవించేలా చూసుకోవాలని మిమ్మల్ని కోరుతున్నాను.

కొందరు సీనియర్ కార్మికులు తీవ్ర అనారోగ్యంతో మెడికల్ బోర్డు అన్‌ఫిట్ కోసం ధరఖాస్తులు చేసుకొంటున్నారని గమనించి, వీరి సౌకర్యంకోసం ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా బోర్డు మెడికల్ పరీక్షలకు అవకాశం కల్పించడం జరిగింది. అర్హత గలవారికే అన్ ఫిట్ లభిస్తుంది. కనుక ఎటువంటి ప్రలోభాలకు, ప్రచారాలకు ఎవరూ లొంగవద్దని కోరుతున్నాను.

సంస్థ అభివృద్ధికి కేవలం యాజమాన్యమే కాదు, మీరుకూడా మంచి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. దీనికోసం ఇటీవలనే **ఐడియా సింగరేణి** అనే ఆన్‌లైన్ అవకాశాన్ని కూడా కల్పించడం జరిగింది. దీనిని సద్వినియోగం చేసుకొంటూ మంచి సూచనలు, ఆలోచనలు తెలియజేయండి. అవి మన కంపెనీ భవిష్యత్తుకు ఉపయోగ పడతాయని ఆశిస్తున్నాను.

సింగరేణి సంస్థ తన కుటుంబ సభ్యులరక్షణ, ఆరోగ్యం, ఉద్యోగ సంబంధిత విషయాల్లో తగిన నిర్మాణాత్మక మరియు సంక్షేమ చర్యలు తీసుకుంటుంది. అలాగే మీరు కూడా బాధ్యతగల సింగరేణీయులుగా మీ మీ విధులు నిర్వహించి సంస్థ ప్రగతికి దోహద పడాలని కోరుకొంటూ మరోసారి అందరికీ దసరా, బక్రీద్ మరియు దీపావళి పండుగలశుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**జై సింగరేణి ! జై హింద్ !!**

**భవదీయుడు**

సు. భట్టాచార్య

**(సుతీర్థ భట్టాచార్య)**

తేది: 05-10-2013

Book-post

To

________________

________________

________________

సుతీర్థ భట్టాచార్య, ఐ.ఎ.ఎస్.
అధ్యక్షులు మరియు నిర్వహాక సంచాలకులు,
సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
సింగరేణి భవన్, రెడ్ హిల్స్,
ఖైరతాబాద్ పి.ఒ.
హైదరాబాద్ 500004